# నీళ్ళు

ఆకాశంలా విశాలంగా విస్తరించుకున్న ఎడారి . . . నెత్తిమీద సూర్యుడు నిప్పుల కుంపటిలా వేలాడుతున్నాడు. అనంతమైన వేడి వాడి శరాలై, వేనవేల పగుళ్ళ నోళ్ళతో మూల్గుతోంది నేల. కనుచూపు మేర పచ్చదనం మచ్చుకైనా కానరాని శిలల సముద్రం . . .

వడివడిగా నడుస్తున్నాను. కాళ్ళకున్న దళసరి బూట్లు కూడా వేడికి కరుగుతున్నట్లు . . . చర్మం కములుతున్నట్లు . . . తొందరగా ఇల్లు చేరుకోకపోతే పెనం మీద జారిన నీటిబొట్టులా ఆవిరైపోతానేమోనని భయం. నిజంగా ఆవిరౌతానా . . . కరిగిన రక్తపు మడుగౌతానేమో . . . కాలిన మాంసం ముద్దవుతానేమో . . .

దాహం వేస్తోంది. నాలిక నీటి చుక్కకోసం తపించి తపించి చిన్నచిన్న ముక్కలుగా బద్దలయింది. నీరు . . . ఎంత అపురూపమైంది! ఎంతటి విలువైందో! తవ్వితే గనుల్లో వజ్రాలైనా దొరుకుతాయి కానీ నీటి జాడే కానరాదు. గత పదేళ్ళ కాలంలో నీరు బంగారం కన్నా ప్రియమైంది. భూమిలోపల నీటి ఉపరితలం అగాధాల్లోకి పారిపోయి శతాబ్దాలు గడిచింది. ఇప్పుడు భూమి గుండెల్ని చీల్చితే నెత్తురొస్తుందేమో కానీ నీళ్ళు రావు.

శరీరం చుట్టూ అల్లుకుని ఉన్న ఇన్సులేటర్ పదార్థంతో చేసిన వస్త్రాలు తీక్షణమైన ఎండ ధాటికి తట్టుకోలేక మొహం వేలాడేస్తున్నాయి. ఈ వేడికి వేగిపోవటం ఇష్టం లేక వేగం పెంచాను.

అగ్ని గుండంలా మండుతోన్న ఆ నేల మీద . . . ప్రాణి కోటి మొత్తం తుడిచిపెట్టుకు

పోయినట్టు అనంతమైన మరుభూమిలా కనిపిస్తున్న ఆ ప్రాంతంలో . . . భూమిలోంచి మొలిచినట్టు ఏదో కన్పించి ఆగిపోయాను. ఇంతటి ఉష్ణోగ్రతని తట్టుకుని మొక్కలు బతకటం అసాధ్యం. మరి అదేమై ఉంటుంది? ఏదైనా వింత జంతువా? భయమేసింది. దగ్గరగా వెళ్ళి చూడాలనుకుని నాలుగడుగులు వేసిన వాణ్ణి ఈ ఆలోచన రాగానే మంత్రించినట్టు ఆగిపోయాను.

అది కదలటం లేదన్న విషయం అర్థమయ్యాక ధైర్యాన్ని కూడగట్టుకుని దానికి వంద మీటర్ల దూరం వరకూ వెళ్ళి నిలబడ్డాను. అది కదిల్తే పారిపోవాలని శరీరాన్ని సమాయత్తపర్చుకున్నాను. మొక్కలా ఉంది కానీ మొక్క కావటానికి వీల్లేదు. అడుగంత ఎత్తుంది. గోధుమ రంగులో అరచేతి మందాన ఆరేడు దళాల్లాంటివి ఉన్నాయి. ఇది మొక్కయితే అవి ఆకులై ఉండొచ్చు. కానీ ఇలాంటి మొక్క గురించి నేనెప్పుడూ విన్లేదు. ఎక్కడా చూళ్ళేదు. నీళ్ళు దొరకని ఎడారుల్లో పెరిగే మొక్కల గురించి నాకు మంచి అవగాహన ఉంది. కానీ ఇదేదో వింతగా... విచిత్రంగా...

నేను అలా నిలబడి ఆశ్చర్యంతో చూస్తుండగానే అది కదిలింది.

భూమిలోంచి టెంటికిల్స్‌లాంటి పొడవాటి వ్రేళ్ళు బైటికొచ్చాయి. అవి సన్నటి ఇనుప చువ్వల్లా ఉన్నాయి. వాటి చివర్లు బ్లేడుతో చెక్కినట్టు మొనదేలి ఉన్నాయి. మొత్తం ఐదు.. చేతికున్న ఐదు వేళ్ళలా . . . అది క్షణాల్లో బంతిలా గుండ్రంగా చుట్టుకుపోయింది. నేను రెండడుగులు వెనక్కి వేశాను. అది వేగంగా దొర్లుకుంటూ వెళ్ళిపోయింది. చాలా దూరం వెళ్ళాక ఆగి– భూమిలోకి వ్రేళ్ళని పాతేసి నిలబడిపోయింది.

నాకప్పుడర్థమైంది. అది మొక్కే . . . దానికి ప్రాణాధారమైన నీళ్ళు అడుగంటి పోవటంతో ఈ మొక్క పరిణామ క్రమంలో తన వ్రేళ్ళని సన్నటి, పొడవాటి కత్తులుగా మల్చుకుంది. ఎంత దూరంలో కాస్తంత తేమ మిగిలి ఉందో గ్రహించే శక్తిని తన స్వంతం చేసుకుంది. అక్కడికి దొర్లుకుంటూ పోయి జీవజలాన్ని పొందే గమనశక్తి పొంది తన మనుగడ సాగిస్తోంది. ప్రకృతికి వ్యతిరేకంగా తన సర్వశక్తుల్నీ ఒడ్డి పోరాడి గెల్చిన ఆ మొక్కలా తన శరీరాన్ని అందుబాటులో ఉన్న అతి తక్కువ నీటికి అనుగుణంగా మల్చుకోవటంలో మనిషే ఓడిపోయాడు.

దేశానికి స్వతంత్రం వచ్చిన యాభై ఏళ్ళకే నీటి కటకట ఆరంభమైంది. అంతా మానవజాతి తప్పిదమే . . . అడవుల్ని ఇష్టం వచ్చినట్టు నరికేసి తమ స్వలాభానికి

వాడుకున్నారు. పంట పొలాల్లో పంటలు పండించటం మానేసి, వాటిపైన బహుళ అంతస్థుల భవనాల్ని నిర్మించారు. నగరాల్లో కాంక్రీట్ అడవుల్ని మొలిపించారు. పల్లెల్ని చెరిపేసి వాటిమీద పట్టణాల్ని పండించారు. జనాభా విపరీతంగా పెరిగిపోయింది. వర్షాలు కరువైనాయి. తీరా కురిసినా ఆ నీటిని నిల్వచేయటంలో అశ్రద్ధ చూపించారు. బొట్టు నీరు బంగారంతో సమానమనే ప్రచారం ప్రభుత్వం చేపట్టే సమయానికే జరగాల్సిన నష్టమంతా జరిగిపోయింది.

మా నాన్న చిన్న పిల్లాడిలా ఉన్నప్పుడు వంద మీటర్ల లోతులో నీళ్ళు పడేవి. నా చిన్నప్పుడు వేయి మీటర్ల లోతుకెళ్ళినా బూడిద తప్ప నీళ్ళు పడేవికావు. దిగుమతి చేసుకోవడానికి పెట్రోలైనా దొరికేది కానీ నీరు మాత్రం దొరికేది కాదు.

స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి నూటయాభై ఏళ్ళు . . . శాస్త్ర పరిశోధనల పుణ్యం వల్ల నీటి అవసరం లేకుండా తయారుచేసుకునే వంటలు వాడకంలోకి వచ్చాయి. శరీరాల్ని ప్రత్యేకంగా తయారుచేసిన కాగితాల్తో శుభ్రపర్చుకోవటం అనివార్యమైంది. ఎటొచ్చీ గొంతు తడుపుకోవడానికే నీళ్ళు . . . కరువయ్యాయి.

వందేళ్ళ క్రితం రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, పంచదార సరఫరా చేసినట్టు ప్రభుత్వం ఇప్పుడు మంచి నీళ్ళు సరఫరా చేయటం ప్రారంభించింది. వ్యక్తుల స్థాయిని బట్టి, హోదాని బట్టి వారానికెన్ని నీళ్ళివ్వాలో నిర్ణయించింది. అత్యున్నతమైన హోదాలో ఉన్న వాళ్ళకు గులాబీకార్డు మీద వారానికి ఇరవై లీటర్ల నీళ్ళు . . . పచ్చకార్డు వాళ్ళకు పది లీటర్లు . . . నాలాంటి చిన్న స్థాయి వాళ్ళకు నీలం కార్డు మీద ఐదు లీటర్ల నీళ్ళు . . . మరీ తక్కువ స్థాయి వాళ్ళకు తెల్లకార్డు మీద రెండు లీటర్లు. ఇలా . . . ప్రభుత్వం నిర్ణయించింది.

ఆ ప్రకటన వెలువడినప్పుడు జరిగిన సంఘటనలు . . . హింసాకాండ కళ్ళముందు కదలాడి ఒళ్ళు భయంతో వణికింది. దాహం అందరికీ ఒకటే కదా . . . స్థాయీ భేదాల్ని బట్టి దాహం వేయదు కదా . . . ఇదేం దారుణం అంటూ మనుషులు తిరగబడ్డారు. పెద్ద హోదాల్లో ఉన్న వ్యక్తులు ఈ తిరుగుబాటుని అణచటానికి ప్రయత్నించారు. ప్రభుత్వం వాళ్ళకి వంతపాడింది. కాల్పులు . . . వందల మంది పిట్టల్లా రాలిపోయారు.

మనుషులు రెండు వర్గాలుగా చీలిపోయారు. పది లీటర్లపైన నీటికి అర్హమైన వాళ్ళు ఒక వైపు . . . ఐదు లీటర్లు, అంతకన్నా తక్కువ నీరు దొరికే నీలంకార్డు, తెల్లకార్డుల వాళ్ళు మరో వైపు . . . కులాలూ మతాలూ ఎవ్వరికీ గుర్తుకు రాలేదు. కేవలం హోదాలే . . . కొన్ని వందల ఏళ్ళ క్రితం మార్క్స్ అనే తత్వవేత్త మనుషుల్ని రెండు వర్గాలుగా గుర్తించాడట. ధనికులు . . . పేదవాళ్ళు. రెండు శతాబ్దాలు దాటిపోయినా ఆయన మాటలు అక్షరసత్యాలుగా మిగిలాయి.

గృహదహనాలు విచ్చలవిడిగా జరిగాయి, ఒక వర్గం వారిమీద మరొక వర్గం దాడులకు పాల్పడింది. నీళ్ళకోసం లూటీలు జరిగాయి. పెద్ద హోదాల్లో ఉన్నవాళ్ళు తమ నీళ్ళు సులభంగా దొంగలకు దొరక్కూడదని సేఫ్టీ లాకర్లలో భద్రపర్చుకున్నారు. ఆ పోరాటంలో నేను నా పెద్ద కొడుకుని పోగొట్టుకున్నాను.

మా ఇంటికి నాలుగిళ్ళవతల రేషన్ దుకాణం పెట్టారు. అప్పటికే నీళ్ళు సరఫరా చేసి ఐదు రోజులైంది. ఐదు లీటర్లు తెచ్చుకున్న మా ఇంట్లోనే నీళ్ళయిపోతే రెండు లీటర్లు మాత్రమే దొరికే వాళ్ళ విషయంలో వేరే చెప్పాలా? మరలా నీళ్ళు కావాలంటే మరో రెండ్రోజులు ఆగాలి. అప్పటివరకూ ప్రాణాలు ఆగేలా లేవు. పదహారేళ్ళ నా పెద్ద కొడుకు ఆవేశంతో లేచాడు.

"ఇలా దాహంతో గొంతెండిపోయి చావడం కంటే క్రూరమైన ఈ ప్రభుత్వంతో పోరాడి చావడమే నయమనిపిస్తోంది నాన్నా" అన్నాడు.

నాకూ రక్తం ఉడికింది. హోదాల్లో విర్రవీగే వాళ్ళకి ఎక్కువ నీరివ్వటం అన్యాయం . . . అమానుషం . . . ఆకలీ దాహం అందరికీ ఒక్కటే . . . అంటూ నినాదాలిచ్చుకుంటూ చాలా మందిని పోగేశాడు వాడు. అందరం కలిసి రేషన్‌షాప్ మీద మారణాయుధాలతో దాడిచేశాం. మా తాతల కాలంలో ఎప్పుడో భూమికోసం పోరాటాలు జరిగాయట. ఆ తర్వాత భుక్తి కోసం జరిగాయట. మా పోరాటం గుక్కెడు నీళ్ళ కోసం . . . గొంతు తడుపుకోవడానికి సరిపడా నీళ్ళకోసం . . . అమృతంలాంటి నీళ్ళకోసం . . . అపురూపమైన నీళ్ళకోసం . . .

రేషన్‌షాపు తలుపులు బద్దలుకొట్టి లోపలికెళ్ళాం. షాపు యాజమాని తుపాకీతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. రెండ్రోజుల తర్వాత సరఫరా చేయటం

కోసం తెచ్చిపెట్టిన నీళ్ళ డ్రమ్ములు విప్లవకారుల రక్తంతో ఎర్రబడ్డాయి. అందులో నా పెద్ద కొడుకు రక్తం కూడా కలిసింది.

ప్రభుత్వం మమ్మల్ని జైల్లో పెట్టింది. హోదాల్ని బట్టే తినే ఆహారంలో తేడా లున్నప్పుడు . . . నీళ్ళ సరఫరాలో తేడాలుంటే తప్పేమిటీ అనేది ప్రభుత్వ వాదన.

మా తిరుగుబాటుని ఇనుప పిడికిళ్ళతో అణచివేసింది ప్రభుత్వం . . . మాకు దొరికే ఐదు లీటర్ల నీరే మహద్భాగ్యంగా భావించి, వాటిని పొదుపుగా వాడుకోడానికి అలవాటుపడ్డాం.

నాలుగు రోజుల క్రితం ఐదు లీటర్ల నీళ్ళుతెచ్చి భద్రంగా లాకర్లో పెట్టాను. దొంగల భయం ఎక్కువైనందు వల్ల ఇప్పుడు అందరూ నీటిని లాకర్లలోనే దాచుకుంటున్నారు. అందుకోసం ప్రత్యేకమైన, అధునాతనమైన లాకర్లు వాడుకలోకొచ్చాయి.

పనిమీద ఇల్లొదిలి వచ్చి మూడ్రోజులైంది. ప్రయాణంలో నా వాహనం పాడైంది. గాల్లో కదిలే కారులాంటి వాహనం. దాంతోపాటు కమ్యూనికేషన్ సిస్టం కూడా పాడైంది. లేకపోతే ఈ పాటికి ఇంట్లో ఉండేవాడిని. పదేళ్ళ నా రెండో కొడుకు నికితేష్ గుర్తొచ్చాడు.

ఇంట్లో వాడొక్కడే ఉన్నాడన్న ఆలోచన అశాంతిని కలుగజేస్తోంది. ఎటొచ్చి ఒకటే ఊరట. ఇంట్లో నీళ్ళున్నాయి . . . వాడికి సరిపడా . . .

కళ్ళముందు సేఫ్టీ లాకర్లోని నీళ్ళే గుర్తొస్తున్నాయి. కాంతి కెరటాల్లా కదిలే అందమైన నీళ్ళు . . . మా తాతగారి రోజుల్లో మల్లెలు, సన్నజాజులు ఉండేవట. వాటి సౌందర్యాన్ని పుస్తకాల్లో చూశాను. అలాంటి అద్భుతమైన పూలతో నిండిన సజ్జలా లాకర్లో నీటి గిన్నె . . . నగిషీలు చెక్కిన గాజు పాత్రలో ముత్యాల్లా కదలాడే నీటి తళుకులు . . .

దాహం వేస్తోంది. విపరీతమైన దాహం. గొంతు తడారిపోయిన బోరు బావిలా బావురుమంటోంది. చుక్కనీళ్ళు చాలు . . . లేకపోతే చచ్చిపోతాను. వేగం పెంచాను.

నా జీవితంతో దారుణంగా ఆడుకున్న నీళ్ళు . . . నాలాంటి ఎంతోమంది జీవితాల్ని క్రూరంగా బలితీసుకున్న నీళ్ళు . . . జీవించడానికి ఆధారమైన నీళ్ళు . . . నా పెద్ద కొడుకు రక్తంతో తడిసిన నీళ్ళు . . . నా భార్యని నా నుంచి దూరం చేసిన నీళ్ళు . . .

"ఇంత పీనాసితనమేంటీ? మరో గుక్క నీళ్ళు తాగుతాను" అంది నా భార్య రెండేళ్ళ క్రితం . . .

"మూర్ఖంగా మాట్లాడకు. మరో మూడ్రోజులు ఆగితే కానీ నీళ్ళు దొరకవు. మిగిలింది ఈ లీటరు నీళ్ళే. ఇప్పటికే ఎక్కువ నీళ్ళు తాగేశావు. ఆ మాత్రం ఓర్చుకోలేవా" అన్నాను కోపంగా.

"నాకు దాహం ఎక్కువని మీకు తెల్సుగా . . . ప్లీజ్ . . . మరో గుక్కెడు. అంతే" అంది.

ఆమెను చూస్తే జాలేసింది. డ్రగ్స్‌కి బానిసలైన వాళ్ళు వాటిని పొందటం కోసం ఏమైనా చేయడానికి సిద్ధపడ్డట్టు – నీటికోసం ఆమె ఏమైనా చేసేలా ఉంది. "మీకు దండం పెడ్తాను. నేను తట్టుకోలేక పోతున్నానండీ. కొద్దిగా చాలు. చాలా కొద్దిగా . . . " అంది. నాకూ ఇవ్వాలనే అన్పించింది. కానీ ఈ విషయంలో గట్టిగా ఉండకపోతే ముందు ముందు మరీ కష్టమని గుర్తొచ్చి, నీళ్ళ గిన్నెని లాకర్లో పెట్టేసి తాళాన్ని నా జేబులో వేసుకున్నాను.

"ఈ మధ్య కాలంలో మనిద్దరికీ జరిగిన గొడవలన్నీ నీళ్ళ గురించే. నువ్వు తెలివిగల దానివి. పరిస్థితిని అర్థం చేసుకో. తక్కువ నీళ్ళతో బతకడాన్ని అలవాటు చేసుకో" అన్నాను.

ఆమె నా వైపు ఆశ్చర్యంగానో, ఆందోళనగానో, అసహ్యంగానో చూసింది. మరునాడు ఉదయం ఆమె లేదు. ఆమె వదిలి వెళ్ళిన ఉత్తరం మాత్రం దొరికింది.

"నీళ్ళ విషయంలో మీ నియంతృత్వాన్ని భరించలేక వెళ్ళిపోతున్నాను. మీతో విడిపోయి వేరుగా బతకటం వల్ల ప్రభుత్వం నుంచి ఎక్కువ నీరు రేషన్ ద్వారా దొరుకుతుంది. మీరూ తెలివిగలవారే. నన్నర్థం చేసుకుంటారని ఆశిస్తాను" ఇదీ ఉత్తరంలోని సారాంశం.

నీళ్ళకోసం కట్టుకున్న మగవాణ్ణీ, కన్న కొడుకునీ వదిలేసి వెళ్ళిన భార్య గుర్తొచ్చి మనసు వికలమైంది. గుండె పట్టేసినట్టు . . . బాధ.

దూరంగా ఇల్లు కన్పిస్తోంది. ఇంకో వందడుగులు . . . అడుగులు తడబడ్తున్నాయి. శరీరం చిగురుటాకులా వణుకుతోంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. కనీసం గుక్కెడు నీళ్ళయినా గొంతు దిగందే చచ్చిపోవటం ఖాయం. దేక్కుంటూ పాక్కుంటూ నడిచి నట్టు . . . నిద్రలో నడిచినట్టు . . . ఇంటి లోపలికెళ్ళాను. నిశ్శబ్దంగా ఉంది . . . ఏడీ నికితేష్ . . . గుండె వేగం హెచ్చింది.

బెడ్రూంనుంచి మూలుగు విన్పించింది. తడబడే అడుగుల్తో లోపలికెళ్ళాను.

మంచంమీద . . . మరణానికి దగ్గరగా నికితేష్ . . .

వాడు బీటలు వారిన నేలలా ఉన్నాడు.

"ఏమైంది బాబూ" అన్నాను. నా గొంతు దుఃఖంతోనో, దాహంతోనో జీరపోయింది.

"దాహం" అన్నాడు సైగల్తో.

"లాకర్లో నీళ్ళున్నాయిగా చిట్టితండ్రీ" అన్నాను ఎలాగోలా గొంతు పెగుల్చుకుని.

"తాళం చెవి నువ్వు తీసుకెళ్ళిపోయావు" వాడు అతి కష్టంమీద సమాధానమిచ్చాడు.

జేబులో తడిమాను. నిజమే . . . లాకర్ తాళాలు నా దగ్గరే ఉండిపోయాయి. వాటిని వాడికివ్వటం మర్చిపోయాను. ఎంత పెద్ద తప్పు చేశానో . . . అయ్యో నా తండ్రీ . . . నాలుగు రోజులు నీళ్ళు లేకుండా ఎలా ఉన్నావురా కన్నా . . . ఎంతటి నరకం అనుభవించావురా బాబూ . . .

ఏడుస్తున్నాను. కన్నీళ్ళు లేని అతి దయనీయమైన ఏడుపు . . .

"నేను చచ్చిపోతున్నాను నాన్నా" అన్నాడు బలహీనమైన స్వరంతో.

"ఒక్క క్షణం ఆగు. ఒకే ఒక్క క్షణం. నన్ను ఒంటరివాణ్ణి చేసి పోకు" అన్నాను.

తాళాలు బైటికి తీశాను. తొట్రుపాటు . . . చేతులు వణుకుతున్నాయి . . . పెదాలు వణుకుతున్నాయి . . . బాధతో హృదయమూ వణుకుతోంది.

తాళాలు కిందపడ్డాయి. కళ్ళు మసగ్గా ఉన్నాయి. చీకటి తెరలు ఒకటొకటిగా చుట్టుకుపోతున్నట్టు . . .

"నాన్నా . . . నేను వెళ్ళిపోతున్నాను . . . సెలవు" అన్నాడు నికితేష్.

"వద్దురా కన్నా ఆగు. నా తండ్రీ . . . నిన్ను చావనివ్వను. బతికించుకుంటాను" తాళాలు అందుకుని లాకర్ తెరిచాను.

అమృతభాండంలా నీళ్ళగిన్నె . . . అందులో వయ్యారంగా కదుల్తూ నీళ్ళు . . . నా పెద్ద కొడుకుని మింగేసిన నీళ్ళు . . . నా భార్యని నా నించి లాగేసుకున్న నీళ్ళు . . . అమాయకంగా కన్పిస్తున్న నీళ్ళు . . .

నా దాహం గుర్తొచ్చింది. గుక్కెడు నీళ్ళు . . . చాలు . . . గొంతు తడిపేటన్ని నీళ్ళు చాలు . . . ప్రాణం విలవిల్లాడింది. మరో క్షణం ఆలస్యమైనా చచ్చిపోతాననిపిస్తోంది. బాబుకి నీళ్ళందివ్వటంలో ఇసుమంత ఆలస్యమైనా వాడు చచ్చిపోతాడు.

ముందు వాడికా? నాకా అనే మీమాంస . . . తండ్రిని కదా . . . ముందు వాడికే . . . నేను చచ్చిపోయినా పర్లేదు. నా బాబు . . . నా ప్రాణం . . . వాడు బతికుంటే నేను బతికున్నట్టే . . .

గిన్నెని భద్రంగా చేతుల్లో పట్టుకుని బైటికి తీశాను. బాబు నోరు తెరిచాడు. నీటి చుక్క కోసం యుగాల తరబడి ఎదురు చూస్తున్న ఎడారిలా ఉంది వాడి నోరు. వాడి కళ్ళు ఓ క్షణం ఆశతో తళుక్కున మెరిశాయి. గదంతా ఎండకాసినట్లు . . .

వస్తున్నా . . నీ దగ్గరికే . . . అంత దూరంగా ఉన్నావేమిరా కన్నా . . . ఎంత నడిచినా తరగనంత దూరం . . . గజాలు మైళ్ళుగా సాగిపోయినట్టు . . . అయ్యో . . . నాకు అందవేమిరా తండ్రీ . . . నా చేతులు శిథిలమైపోయాయా . . . నా కాళ్ళు సీసంలో దిగబడిపోయాయా . . . ఇంకో అడుగు . . . అంతే. నిన్ను చేరుకుంటాను. నీ గొంతులో గుక్కెడు నీళ్ళు పోస్తాను. అయ్యో నా శరీరం కదలదేం . . . నువ్వెక్కడున్నావు బాబూ . . . కళ్ళకు కన్పించవేం . . . ఇంతటి చీకటి ఎక్కడిది . . . ఇప్పుడేగా బయట భళ్ళున కాస్తున్న ఎండలోని వెలుతురునంతా మోసుకొచ్చాను.

ఇంకో అడుగేరా తండ్రీ. నేను రాలేకున్నాను. నువ్వయినా నా దగ్గరకు రారా . . . నేను చూసిన మొక్కలా నా దగ్గరకు దొర్లుకుంటూ రారా కన్నా . . .

గాజు గిన్నె కిందపడి భళ్ళున పగిలిన శబ్దం చెవులకు లీలగా . . . అనంత దూరాల్నించి విన్పిస్తున్నట్టు . . .

చీకటి . . . చిక్కని చీకటి . . . అంతా పర్చుకుని . . . నన్ను మింగేస్తూ . . . నా బాబుని మింగేస్తూ . . .

(ఆదివారం ఆంధ్రజ్యోతి - 16 ఏప్రిల్, 2006)